సాక్షి
విజయనగరం

బుధవారం । 8 । మే । 2024



వృత్తిదారుల మోములో ఆనందం... - 8లో

చేతి వృత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగింది.



అంతులేని విషాదం..

రోడ్డు ప్రమాదం ఇద్దరి వలంటీర్లను బలితీసుకుంది. వారి కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది. - 8లో



రిసెప్షన్ సెంటర్ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు - 8లో

రిసెప్షన్ సెంటర్ల వద్ద పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు.

న్యూస్‌రీల్

జిల్లాలో ప్రారంభమైన హోమ్ ఓటింగ్



పట్టణంలో ఓ వృద్ధురాలితో ఓటింగ్ చేయిస్తున్న అధికారులు

విజయనగరం అర్బన్: జిల్లాలో హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయడానికి అవకాశంలేని 85 ఏళ్ల పైబడిన వయోవృద్ధులు, 40 శాతం దివ్యాంగత్వం దాటిన విభిన్న ప్రతిభావంతులు తమ ఇంటివద్దనే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఈ ఏడాది కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చింది. హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవడానికి 86 మంది దివ్యాంగులు, 156 మంది వయోవృద్ధులు దరఖాస్తు చేసుకున్నారు. వీరి ఇళ్లకు వెళ్లి ఓటు తీసుకునే ప్రక్రియ మంగళవారం ప్రారంభించారు. సెక్టార్ అధికారుల పర్యవేక్షణలో పీఓలు, బీఎల్వోలు, మైక్రో అబ్జర్వర్లు, పోలీస్ సిబ్బంది, దరఖాస్తు చేసినవారి ఇంటింటికి వెళ్లి, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో హోమ్ ఓటింగ్ చేయించారు.

15 నుంచి రామనారాయణంలో ఉచిత వ్యక్తిత్వ వికాస శిబిరం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో ఈ నెల 15 నుంచి 17వరకు ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ శిబిరం జరుగుతుందన్నారు. బెంగళూరుకు చెందిన రచయిత శ్రీరామ చక్రధర్ శిక్షణ శిబిరానికి హాజరై వ్యక్తిత్వ వికాస శిక్షణపై అవగాహన కల్పిస్తారన్నారు. శిక్షణకు హాజరయ్యే వారికి విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్ ఎదురుగా ఉన్న ఎన్‌సీఎస్ మల్టీప్లెక్స్ నుంచి ఉచిత బస్సు సౌకర్యం, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. శిక్షణకు హాజరయ్యే వారు ఈ నెల 12వ తేదీ లోగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, వివరాలకు సెల్: 93470 17144, 89197 67705 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడూ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- మూడో రోజు 3,638 బ్యాలెట్‌ల నమోదు

విజయనగరం అర్బన్: ఇతర జిల్లాల్లో పనిచేస్తూ ఓటు హక్కు ఉన్న 494 మంది ఉద్యోగులకు బుధవారం (8వ తేదీ) ఓటింగ్ అవకాశం కల్పిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం గతనెల 22వ తేదీలోగా ఫారం-డి సమర్పించిన వారికి మంగళవారంతో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ముగిసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముఖ్య అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశాల మేరకు ఇతర జిల్లాల్లో పనిచేస్తూ ఇక్కడ ఓటుహక్కు కలిగిన ఆరోగ్యశాఖ సిబ్బంది 463 మంది, అగ్నిమాపక శాఖ ముగ్గురు, జిల్లా జైళ్ల శాఖకు చెందిన నలుగురు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ-18, పౌర సంబంధాల శాఖకు చెందిన ఆరుగురికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అవకాశం కల్పించారు.

మూడో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నియోజకవర్గాల వారీగా :

నియోజకవర్గం	నమోదైన పోస్టల్ బ్యాలెట్లు
బొబ్బిలి	569
చీపురుపల్లి	306
గజపతినగరం	497
నెల్లిమర్ల	378
విజయనగరం	1,020
ఎస్.కోట	477
రాజాం	391
మొత్తం మూడురోజుల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్: 14,632	
మొత్తం మూడురోజుల ఇతర జిల్లాల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్: 2,467	

- జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు మేలే తప్ప నష్టం ఉండదు
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై అపోహలు కల్పిస్తున్న టీడీపీ, ఎల్లోమీడియా
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఉంది
- ఈ ఎన్నికల్లోనూ విజయం తథ్యం
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో గజపతి నగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ఓట్ల కోసమే దుష్ప్రచారం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఉమ్మడి విజయనగరం జిల్లాలకు చేసిన మేలు ఒక్కటీ లేదని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పల నర్సయ్య చెప్పారు. చెప్పుకోవడానికి ఏమీ లేక ఓట్ల కోసం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారానికి దిగడం నీచాతినీచమని ధ్వజమెత్తారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకే మేలే తప్ప నష్టం ఉండదని విస్పష్టంగా చెప్పారు. గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మరోసారి బరిలోకి దిగిన ఆయన తన విజయంపై ధీమా వ్యక్తం చేశారు. 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు.



సాక్షి: టీడీపీ, జనసేన పార్టీ నాయకులు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులపై హద్దులు మీరి దుష్ప్రచారం చేయడం వెనుక లక్ష్యమేమిటి?

అప్పలనర్సయ్య: అధికారం దక్కదనుకున్నప్పుడే చంద్రబాబు అండ్ కో దుష్ప్రచారం ఆకాశమంత ఎత్తులో చేస్తుంది. తొలి నుంచి వారి తీరే అంత. సొంత మామకు వెన్నుపోటుతో తొలుత ముఖ్యమంత్రి పదవి పొందిన చంద్రబాబు 1999 సంవత్సరంలో బీజేపీ అనుకూల గాలితో రెండోసారి ఆ కుర్చీ ఎక్కారు. అలా తొమ్మిదేళ్ల అధికారంలో ఉన్నా హైటెక్ పేరుతో హంగామా తప్ప రాష్ట్రంలో అత్యంత ప్రధానమైన వ్యవసాయ రంగాన్ని విస్మరించారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఉద్యమిస్తే బషీర్‌బాగ్‌లో రైతులపై కాల్పులు జరిపించి ముగ్గురి ప్రాణాలు బలిగొన్నారు. అప్పట్లో చంద్రబాబుపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అదే సమయంలో అలిపిరి ఘటనతో సానుభూతి వస్తుందని ముందస్తు ఎన్నికలకు వెళ్లినా ప్రజలు అతన్ని ఇంటికి పంపించారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి సంక్షేమ నినాదంతో ముఖ్యమంత్రి అయ్యారు. ఇచ్చిన హామీల కన్నా మిన్నగా రాష్ట్రాన్ని ఇటు సంక్షేమంలో, అటు అభివృద్ధిలో ముందుకు నడిపించారు. అందుకే 2009 ఎన్నికల్లోనూ ఆయనకే ప్రజలు పట్టం కట్టారు. అప్పుడు కూడా ఇదే చంద్రబాబు, ఆయన అనుకూల పచ్చమీడియా కట్టుకథలు, అభూత కల్పనలతో ప్రజలను భయభ్రాంతులను చేయడానికి ప్రయతించినా తమ వివేచనతో నిర్ణయం తీసుకున్నారు. 2014 ఎన్నికల్లో 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన బాబు ప్రజలను మోసం చేయడంతో 2019 ఎన్నికల్లో ఓటుతో గట్టిగా బుద్ధిచెప్పారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పటి నుంచి సంక్షేమ, అభివృద్ధి పాలన అందించారు. కరోనా కష్టకాలంలో చంద్రబాబు హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్యాలెస్ గేట్లు మూసేసుకుంటే, జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం నిరంతర పర్యవేక్షణతో ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. విపత్తు నిర్వహణలో ఆయన శైలిని పొరుగు రాష్ట్రాల నాయకులూ ప్రశంసించారు. నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలతో పాటు నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందించారు. 59 నెలల పాలనలో మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను నెరవేర్చారు. మన ఉమ్మడి విజయనగరం జిల్లానే చూసుకుంటే చంద్రబాబు చేయలేక చేతులెత్తేసిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, జాతీయ రహదారుల విస్తరణ తదితర పనులన్నీ కొలిక్కి తీసుకొచ్చారు. వీటన్నింటి నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి చంద్రబాబు అండ్ కో దుష్ప్రచారానికి తెగించారు. అంతే తప్ప వారి ఆరోపణల్లో వాస్తవం లేదు.

సాక్షి: ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రతిపాదించిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను ఇప్పుడు అదే కూటమిలోనున్న టీడీపీ, జనసేన వ్యతిరేకించడం వెనుక ఉద్దేశం ఏమై ఉంటుంది?

అప్పలనర్సయ్య: టీడీపీ, జనసేన ఆ యాక్ట్‌ను వ్యతిరేకించట్లేదు. దుష్ప్రచారం చేస్తున్నాయి. వాస్తవానికి భూహక్కు చట్టం అన్నివిధాలా రైతులకు ఉపయోగపడుతుంది. మేలు చేస్తుంది. దశాబ్దాల నుంచి రీసర్వే జరగలేదు. నాటి రెవెన్యూ రికార్డులు సరిగాలేవు. చాలామంది రైతులకు యాజమాన్య హక్కుపత్రాలు లేవు. కోర్టుల్లో సివిల్ లిటిగేషన్లు పెరిగిపోతున్నాయి. కలెక్టరేట్లకు వచ్చే ఫిర్యాదుల్లో అధిక భాగం భూవివాదాలే. ఇంట్లో ఏ అత్యవసరం వచ్చినా భూమిని అమ్ముకోవడానికీ వీల్లేని పరిస్థితుల్లో ఎంతోమంది అష్టకష్టాలు పడ్డారు. వీటన్నింటికీ పరిష్కారంగా భూసర్వే చేయించాలని రైతులు చాలామంది కోరుకున్నారు.

సాక్షి: భూహక్కు సాకార దిశగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

అప్పలనర్సయ్య: పేదల వద్దనున్న డి.పట్టా భూములు, చుక్కల భూములు వాస్తవానికి ప్రభుత్వ భూములు. వాటిని ఏళ్ల తరబడి సాగుచేసుకోవడమే తప్ప అత్యవసర ఆర్థిక అవసరాలకు అమ్ముకోవడానికి వీల్లేని పరిస్థితి. వారికి మేలు చేసేలా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భూహక్కు కల్పించింది. లక్షలాది ఎకరాల డి.పట్టా భూములను జిరాయితీగా మార్పుచేసింది. చుక్కల భూములకు మోక్షం కల్పించింది. వేలాది మంది గిరిజనులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా భూపట్టాలు ఇచ్చారు. అలాంటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల భూమి ఎందుకు లాక్కొంటుంది? 14 ఏళ్ల పాలనలో రైతులకు మంచి పనులు ఒక్కటైనా చేశానని చంద్రబాబు చూపించగలరా?



కేంద్రంలోని బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా సమగ్ర భూసర్వేకు మొగ్గు చూపించింది. నాడు అసెంబ్లీలో జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులతో పాటు పయ్యావుల కేశవ్ తదితర టీడీపీ నాయకులు కూడా ఈ భూసర్వే చట్టంపై హర్షం ప్రకటించారు. తీరా ఎన్నికలు వచ్చేసరికి ఓట్ల కోసం దాన్నే టీడీపీ నాయకులు రైతులకు బూచిగా చూపిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇది చాలా నీచమైన పని.

సాక్షి: భూ సర్వేకు రైతుల సహకారం ఎలా ఉంది?

అప్పలనర్సయ్య: ఉమ్మడి విజయనగరం జిల్లాలో వ్యవసాయమే ప్రధానం. ఎక్కువ మంది రైతులు, వ్యవసాయ కూలీ కుటుంబాలే. భూ సర్వే వల్ల నష్టపోయామని ఇప్పటివరకూ ఒక్కరైనా జిల్లాలో చెప్పారా? లేకపోయినా అదో భూతంలా టీడీపీ నాయకులు, ఎల్లోమీడియా తప్పుడు ప్రచారం చేస్తోంది. రైతులు మాత్రం భూసర్వే సహకరిస్తున్నారు. అధికారుల సమక్షంలో హక్కులు పొందుతున్నారు.

సాక్షి: వచ్చే వారమే పోలింగ్. మీ ప్రచారం ఎలా సాగుతోంది?

అప్పలనర్సయ్య: అన్నివిధాలా వైఎస్సార్‌సీపీ ముందుంది. ఏ గ్రామాలకు వెళ్లినా మహిళల నుంచి మంచి స్పందన వస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకంలోనూ వారికే పెద్దపీట వేసింది. గర్భంలోనున్న శిశువు నుంచి ఇంట్లోనున్న వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరి సంక్షేమానికి గతంలో ఎన్నడూలేనివిధంగా తీసుకున్న చర్యలు వారిని ఆలోచింపజేస్తున్నాయి. నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లో, అత్యాధునిక వైద్యం ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించడాన్ని వారు చూస్తున్నారు.

సాక్షి: నవరత్నాల ప్లస్‌పై ప్రజల స్పందన ఎలా ఉంది?

అప్పలనర్సయ్య: గత 59 నెలల పాలనలో క్రమం తప్పక 130 సార్లు బటన్ నొక్కి నవరత్నాలను అందించిన వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలని అన్నివర్గాల వారు ఆశిస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల ప్లస్ కోసం మరో 130 సార్లు బటన్ నొక్కుతారని బలంగా నమ్ముతున్నారు. అందుకోసం ఎమ్మెల్యేకు ఒకటి, ఎంపీకి ఒకటి రెండు బటన్లు నొక్కాలన్న జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునకు సానుకూలంగా స్పందించే అవకాశం ఉంది. మళ్లీ వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే.

సాక్షి: మీ నియోజకవర్గానికి అభివృద్ధి ప్రణాళిక ఏమిటి?

అప్పలనర్సయ్య: విద్య, వైద్యం, రోడ్లు, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి గత ఐదేళ్లలో ప్రాధాన్యం ఇచ్చాం. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే తోటపల్లి బ్రాంచ్ కెనాల్, ఏడువంపుల గెడ్డ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు సత్వర పూర్తిచేసి ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తాం. గజపతినగరంలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభిస్తాం. డిగ్రీ కాలేజీ భవనాల నిర్మాణం పూర్తిచేస్తాం. అక్కడక్కడా మిగిలిన రోడ్ల నిర్మాణ పనులన్నీ సత్వరమే చేయిస్తాం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేస్తాం.

గెలుపు పథం

ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో అభ్యర్థులు ప్రచారంలో జోరు పెంచారు. ఇంటింటికీ వెళ్లి చేసిన మేలును వివరించి ఓటుతో ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. గెలుపు మంత్రం వినిపిస్తున్నారు. - సాక్షి నెట్‌వర్క్

ప్రచార పర్వం



రామభద్రపురం మండలం జన్నివలసలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఎన్నికల ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.



నెలిమర్ల నగర పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్ బాబు స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



విజయనగరం జిల్లా కేంద్రంలోని నాగవంశం వీధిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్ర స్వామి ఇంటింట ప్రచారం చేశారు. ఆయనకు మద్దతుగా వీధి వాసులందరూ ప్రచారంలో పాల్గొన్నారు.



జామి మండలం లొట్లపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు అక్కడి మహిళలు హారతిచ్చి, విజయతిలకం దిద్దారు. మహిళల ఓట్లన్నీ ఫ్యాన్ గుర్తుకేనంటూ భరోసా ఇచ్చారు.



రాజాం పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలేరాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అక్కడి ఓటర్లకు ఫ్యాన్‌గుర్తు ఓటేయడంపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు.



ఎల్.కోట మండలం భీమాళి గ్రామంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామస్తులకు, గ్రామానికి 59 నెలల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో చేసిన మేలును వివరించారు. ఓటుతో సంక్షేమ, అభివృద్ధి పాలనకు మద్దతుపలకాలని కోరారు.

- రాజరిక పాలనను వ్యతిరేకిస్తున్న విజయనగరం వాసులు
- ఎన్నికల్లో గెలిచి కోటకే పరిమితమైన వారు మాకొద్దంటున్న జనం
- కరోనా కష్టకాలంలో కోటదాటి బయటకు రాని రాజులు
- 2014-19 మధ్యలో కేంద్ర మంత్రిగా చేసిన ఒక్క మంచిపని చెప్పండంటూ ప్రశ్న
- దాహార్తితో అల్లాడినా పట్టించుకోని వైనం
- రోడ్ల విస్తరణ పనులను పక్కన పెట్టిన దుస్థితి
- శివారు కాలనీల్లో సదుపాయాల కల్పనపై అశోక్ చిన్నచూపు
- చారిత్రక విజయనగర వైభవాన్ని మసకబారించేలా పనితీరు..
- నాటికి నేటికీ తేడా చూడండంటూ వేలెత్తి చూపుతున్న ప్రజలు

ఆ కష్టాలు మాకొద్దు 'రాజా'..!

పాలకుడంటే జనం కష్టాలు తెలిసినవాడు.. తెలుసుకునేవాడై ఉండాలి.. ప్రజల అవసరాలు ఎప్పటికప్పుడు తీర్చగలగాలి. ఆపద సమయంలో నేనున్నాంటూ అభయహస్తం అందించి ఆదుకోవాలి. ఓ విజన్‌తో నగరాభివృద్ధికి కృషిచేస్తూ.. ప్రతీ ఒక్కరికీ మంచి చేయాలన్న తపనతో ముందుకు సాగాలన్నది జనం మాట. అధికారాన్ని అలంకారంగా భావించి.. కష్ట కాలంలో కోటదాటని పాలకులు.. ఎన్నికల వేళ ప్రజల వద్దకు వస్తుంటే ఛీకొడుతున్నారు. దాహార్తితో అల్లాడుతున్నా పట్టించుకోని రాజులు.. రోడ్ల విస్తరణ పనులు పూర్తిచేయనివారు.. విజయనగర వైభవాన్ని మసకబారించేలా వ్యవహరించే రాజరిక పాలన మాకొద్దంటూ మొహంమీదే చెబుతున్నారు. అనునిత్యం అందుబాటులో ఉంటూ.. కార్పొరేట్ స్థాయికి తగ్గట్టుగా విజయనగర అభివృద్ధికి అనునిత్యం పాటుపడే నాయకుడే పాలకుడుగా ఉండాలని సుస్పష్టం చేస్తున్నారు.



విజయనగరం: విజయనగరం.. చారిత్రక నేపథ్యం కలిగిన నగరం. ఏళ్ల తరబడి రాజుల పాలనలో ఉన్నా అభివృద్ధి శూన్యం. రాజులను నమ్మి జనం అధికారం కట్టబెట్టినా అది అలంకార ప్రాయంగానే చూశారు. ప్రజల కష్టాలు అరణ్యరోదనగానే మిగిలాయి. ఏ నాడూ ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్న ధ్యాస, మంచిచేయాలన్న తపన రాజరిక కుటుంబానికి లేకపోవడమే దీనికి కారణం. ఓ వైపు నగర జనాభా పెరుగుతున్నా... కాలనీలు విస్తరించినా ఆ స్థాయిలో సౌకర్యాలు కల్పించేందుకు కనీసం కృషి చేయలేదు. ఆ ఆలోచన కూడా రాలేదు. కేంద్ర మంత్రిగా పనిచేసిన అశోక్ గజపతిరాజు కోట దాటి బయటకు వచ్చిన సందర్భాలు అరుదు. జనానికి రాజు మొహం కనిపించిందంటే అదే మహాభాగ్యంగా ఉండేది. ఎన్నికల వేళ జనంలోకి రావడం.. తర్వాత బంగ్లాకు లేదంటే ఢిల్లీకి పరిమితం కావడమే ఏళ్ల తరబడి సాగుతున్న తంతు. 2014-19 మధ్య టీడీపీ హయాంలో నగర వాసులు దాహార్తితో అల్లాడినా మంత్రిగా ఉండి కనీసం పట్టించుకోలేదు. గుక్కెడు తాగునీటి కోసం బంగ్లా వద్ద ఆందోళనలు చేసినా కనికరించలేదు. రోడ్ల విస్తరణ పరిస్థితీ అంతే. తవ్వేసి వదిలేశారు. పాడైన రోడ్లపై రాకపోకలకు పట్టణ వాసుల అవస్థలు వర్ణనాతీతం. పదవీ కాలమంతా కోట, పరిసరాలను అందంగా తీర్చిదిద్దేందుకే పరిమితమయ్యారు. అన్ని రంగాల్లో నగర అభివృద్ధిని మసకబారించారన్న అపవాదను అశోక్ మూటగట్టుకున్నారు. కార్పొరేషన్ స్థాయిలో సదుపాయాల కల్పనకు అశోక్ కనీసం ఆలోచన చేయలేదని జనం బహిరంగంగానే విమర్శిస్తున్నారు. నగరంలోని శివారు కాలనీల పరిస్థితి అయితే ఐదేళ్ల కిందట దుర్భరం. తాగునీరు, డ్రైనేజీలు, రోడ్ల సదుపాయాలు కల్పించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అశోక్ కనీసం పట్టించుకోలేదు. ఇప్పుడు కుమార్తె తరఫున ప్రచారానికి వస్తున్న అశోక్‌ను జనం బహిరంగంగానే నిలదీస్తున్నారు. మీరు పదవులు అనుభవించడమే తప్ప జనానికి ఏ రోజైనా మేలు చేశారా..? కనీసం మా సమస్యలు ఆలకించారా..? మాట్లాడేందుకు అవకాశం కల్పించారా..? అంటూ ప్రశ్నిస్తున్నారు.

జనాభా పెరిగినా..

విజయనగరంలో 2001 సంవత్సరంలో సుమారు లక్ష వరకు ఓటర్లు ఉండగా... 2005 నాటికి 1.05 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 2.44 లక్షల జనాభా ఉండగా.. 2014 సంవత్సరం నాటికి జనాభా సంఖ్య సుమారు 3 లక్షలు ఉండేది. అప్పట్లో గాజులరేగ, జమ్ము, ధర్మపురి, అయ్యన్నపేట, వేణుగోపాలపురం, కెఎల్‌పురం ప్రాంతాలను విజయనగరం మున్సిపాలిటీలో విలీనం చేయడంతో పట్టణ విస్తీర్ణం పెరిగింది. వీటి పరిధిలో గుర్తింపు పొందిన మురికివాడలు 80 వరకు ఉండేవి. వీరిలో అర్హులైన వారికి హౌస్‌ఫర్ ఆల్ పథకంలో ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తులు స్వీకరించగా.. లబ్ధిదారుల నుంచి టీడీపీకి చెందిన దిగువ స్థాయి నాయకులు లంచాలు వసూలు చేసి చివరికి ఇల్లు అప్పగించకుండా మోసం చేసినట్టు కొందరు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

నాటికి నేటికీ తేడా చూడు..

రాజులు కోట, బంగ్లాకే పరిమితమైతే.. నేటి పాలకులు జనం మధ్యనే ఉంటూ.. జనం అవసరాలు తెలుసుకుంటూ అభివృద్ధి పనులు చకచకా పూర్తిచేస్తున్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నగరాన్ని తీర్చిదిద్దుతున్నారు. కేవలం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ 59 నెలల పాలనలో ఇది మన విజయనగరం అని మురిసిపోయేలా.. గర్వంగా చెప్పుకునేలా అన్ని కూడళ్లను అందంగా తీర్చిదిద్దారు. నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచేలా చెరువు గట్లను పార్కులుగా మలిచారు. మహిళల కోసం రాష్ట్రంలోనే తొలిసారిగా పార్కును నిర్మించారు. తాగునీటి పథకాలు నిర్మించి నగరవాసులకు శాశ్వతంగా తాగునీటి కష్టాలను దూరం చేశారు. శివారు కాలనీలకు రోడ్లు వేశారు. విద్య, వైద్య సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు. సరస్వతీ నిలయాలకు సొబగులద్దారు. నగరంలో రోడ్ల విస్తరణ పనులు పూర్తిచేశారు. నగరానికి ఏ వైపు నుంచి వచ్చిన వారికైనా ఇది మన విజయనగర వైభవం అని చాటిచెప్పేలా హంగులు కల్పించారు.

2014-19 మధ్య రూ.279 కోట్లతో రెండువేల పనులు చేపట్టేందుకు అప్పటి టీడీపీ పాలకవర్గం ఆమోదించగా... అందులో రూ.93 కోట్లతో 700 పనులు మాత్రమే పూర్తిచేయగలిగింది.

క్లుప్తంగా

నేడు ఎస్వీ డిగ్రీ కళాశాలకు ముగ్గురు కమిటీ సభ్యులరాక


ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోగల శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీకళాశాలకు రాష్ట్ర కాలేజీయేట్ కమిషనర్ డాక్టర్ పోల.భాస్కర్ ఆదేశాల మేరకు త్రిసభ్య కమిటీసభ్యులు బుధవారం వస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తమ కళాశాలకు నాక్ (జాతీయగుర్తింపు నిర్ధారణచేసే కౌన్సిల్) బృందం ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలలో రానున్నందున ముందస్తుగా ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అమరావతి నుంచి డాక్టర్ కె.విజయ్‌బాబు (ఓఎస్డీ), డాక్టర్ జె. జాన్‌కిరణ్ (అకడమిక్ ఆఫీసర్), ఈ.వరప్రసాద్(అకడమిక్ ఆఫీసర్)లు కళాశాలకు వస్తున్నట్లు తెలిపారు. వీరు కళాశాలను సందర్శించి నాక్ కమిటీ వచ్చే సమయానికి చేయాల్సిన పనులు, రికార్డులు, అకడమిక్ విధానం, విద్యాప్రమాణాలు పెంచేందుకు తగు సూచనలు, కళాశాలలో మెరుగు పరచాల్సిన పలుఅంశాలు, అకడమిక్ కార్యకలాపాల మెరుగుకు సూచనలు, సలహాలను అందిస్తారని తెలిపారు. కళాశాలలో బోధన సిబ్బందితో మాట్లాడి బోధనలో తీసుకోవాల్సిన అంశాలపై వివరిస్తారని తెలిపారు.

రిసెప్షన్ సెంటర్ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి


లెండి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం అర్బన్: రిసెప్షన్ సెంటర్ల వద్ద పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, ఎస్పీ దీపికతో కలిసి డెంకాడ మండలంలోని లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్ సెంటర్‌ను మంగళవారం పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్‌రూమ్‌లు, బారికేడింగ్, పార్కింగ్, భోజన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. లెండి కళాశాలలో రాజాం, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని.. ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను తీసుకు వచ్చే అధికారులు, సిబ్బంది రాకపోకలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. బస్సులు, అధికారుల వాహనాలు లోపలికి రావడానికి, సిబ్బందిని దించి బయటకు వెళ్లడానికి వీలుగా మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది ఈవీఎంలతో లోపలికి వచ్చిన దగ్గర నుంచి.. తమకు కేటాయించబడిన కౌంటర్లకు సులువుగా చేరుకునేలా నేమ్‌బోర్డులు, డైరెక్షన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని చెప్పారు. పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్‌డీఏ ఎస్‌డీ అనిత, రిసెప్షన్ సెంటర్ నోడల్ అధికారులు మెప్మా పీడీ ఎం.సుధాకరరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజు, డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కరరావు, డీఎస్‌ఓ మధుసూదనరావు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ లక్ష్మణరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ విజయలక్ష్మి, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

- సాధారణ పరిశీలకుడు ప్రమోద్‌కుమార్ మెహర్దా

పార్వతీపురం: సాధారణ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడంలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా అన్నారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో సూక్ష్మ పరిశీలకులకు ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ రహస్యంగా, ప్రశాంతంగా జరగాలని, ఓటరు మినహా పోలింగ్ కేంద్రాలలోకి ఎవరినీ అనుమతించరాదని చెప్పారు. పోలింగ్ జరిగిన చోట ఎక్కడైనా హింసాత్మక ఘటనలు జరిగితే ప్రిసైడింగ్ అధికారి, పోలీస్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ప్రచారం చేయడం నిషేధమని పేర్కొన్నారు. నియమించిన పోలింగ్ ఏజెంట్లు ఉదయం 5గంటలకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹153	₹276	₹286

వృత్తిదారుల మోములో ఆనందం...


జగనన్న చేదోడు చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న అధికారులు (ఫైల్)

- నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు అండగా నిలిచిన 'జగనన్న చేదోడు'
- ఏటా రూ. పది వేల ఆర్థిక సాయం
- జిల్లాలో నాలుగు విడతల్లో 63,808 మందికి రూ. 63.80 కోట్ల సాయం
- టీడీపీ హయాంలో వృత్తిదారులకు మొండిచేయి
- జగనన్న ప్రభుత్వంలో వృత్తిదారులకు దక్కిన గౌరవం

విజయనగరం ఫూల్‌బాగ్: చేతి వృత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగింది. 21 నుంచి 60 సంవత్సరాల వయస్సుండి సొంత షాపు కలిగిన రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేదోడు పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం కింద అర్హత కలిగిన రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏడాదికి రూ. పది వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు నాలుగు విడతల సాయం అందింది. లబ్ధిదారులతో దరఖాస్తు చేయించడంలో వలంటీర్లు, ఈకేవైసీ చేయించడంలో సచివాలయ సిబ్బంది కీలకపాత్ర పోషించారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో లబ్ధిదారులు వారికి కావాల్సిన పనిముట్లు, సామగ్రి కొనుగోలు చేసుకుని ఆర్థికంగా స్థిరపడ్డారు.

వృత్తిదారులకు అండగా...

జగనన్న ప్రభుత్వం ఏటా ఇచ్చే రూ.10 వేలను రజకులు, టైలర్లు, నాయీ బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వారి వత్తికి సంబంధించిన వస్తువుల కొనుగోలు, షాపు అద్దెలు, విద్యుత్ బిల్లులకు ఖర్చు చేసుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏటా క్రమం తప్పకుండా ఆర్థిక సాయం అందించడంపై ఆయా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

జగనన్న చేదోడు లబ్ధిదారులు వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	అందిన మొత్తం (రూ.కోట్లలో)
2020-21	16,359	రూ.16.35
2021-22	13,311	రూ.13.31
2022-23	17,245	రూ.17.24
2023-24	16,893	రూ.16.89
	63,808	రూ.63.80 కోట్లు (సుమారు)

మాకు అండగా నిలుస్తున్నారు..



ప్రజా సంకల్పయాత్రలో మా కష్టాలను అప్పటి ప్రతిపక్ష నేత జగన్ మోహన్‌రెడ్డికి విన్నవించుకున్నాం. ఆనాడే ఆయన మాకు మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు నాకు రూ. 40 వేలు జమ చేశారు. చంద్రబాబు మాకు గతంలో ఏ రకమైన సాయం చేయలేదు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను సీఎంగా గెలిపించుకుంటాం.

– పొంతపల్లి పాపారావు, టైలర్, నెల్లిమర్ల

రుణపడి ఉంటాను..



రజక కులవత్తి చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాను. సామాగ్రి కొనుగోలు చేయడానికి ఆర్థిక స్తోమత లేక చాలా ఇబ్బందులు పడేవాడ్ని. గతంలో మాకు ఆర్థిక సాయం చేసిన ప్రభుత్వాలు లేవు. మాలాంటి పేదల కష్టాలను తెలుసుకున్న జగన్‌బాబు ప్రతి ఏటా రూ. 10 వేలు మాకు అందించారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాను.

– శీల పైడితల్లి, రజక వృత్తిదారుడు, కొత్తపేటగ్రామం, నెల్లిమర్ల మండలం

గతంలో ఏ ప్రభుత్వం సహాయం చేయలేదు



నేను ముప్పై ఏళ్లుగా సెలూన్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆర్థిక సాయం చేయలేదు. జగనన చేదోడు పథకం ద్వారా నాలుగేళ్లలో ఇంతవరకు రూ.40 వేలు అందుకున్నాను. ఇళ్ల వద్దకే వలంటీర్లు వచ్చి అవసరమైన పత్రాలను పూర్తిచేసి సచివాలయ సిబ్బందికి అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సాయం చేయడం సంతోషంగా ఉంది. అలాగే నా షాపునకు సంబంధించి 150 యూనిట్లు లోపు వినియోగం ఉండడంతో బిల్లు పూర్తిగా ఉచితం.

– దూరి శ్రీనివాసరావు, నాయీబ్రాహ్మణ వృత్తిదారుడు, నెల్లిమర్ల

జనంలేని యువగళం

- లోకేశ్ యువగళం సభకు ముఖం చాటేసిన జనసేన, బీజేపీ జిల్లా నాయకులు
- సభను పట్టించుకోని యువకులు


జనంలేక బోసిపోయిన లోకేశ్ యువగళం సభ

విజయనగరం రూరల్: విజయనగరం జిల్లా కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేత నారా లోకేశ్ మంగళవారం నిర్వహించిన యువగళం సభ జనంలేక బోసిపోయింది. లోకేశ్ పొంతనలేని సమాధానాలు నవ్వుతెప్పించాయి. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టుకు లోకేశ్, ఆయన టీమ్ సభ్యులు ప్రదర్శించిన యాక్టింగ్ జతకావడంతో సభకు హాజరైన ఆ పార్టీ నాయకులకే విసుగుపుట్టించింది. స్థానిక అయోధ్య మైదానంలో లోకేశ్ యువగళం సభ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. జనం హాజరుకాక పోవడంతో సాయంత్రం 5.10 గంటలకు ప్రారంభించారు. యాంకర్‌ను సైతం విజయవాడ నుంచి రప్పించుకుని తనకు, తన పార్టీకి అనుకూలమైన ప్రశ్నలు అడిగించుకుని మరీ జవాబులు చెబుతుంటే జిల్లా యువత ఆశ్చర్యానికి లోనయ్యారు. రానున్న ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విశాఖను దేశంలోనే నంబర్ వన్ ఉద్యోగ రాజధానిగా చేస్తామని ప్రగల్భాలు పలికాలు. 2014 ఎన్నికల హామీల్లో భాగంగా నిరుద్యోగి భృతి ఇస్తామని చెప్పి ఎగనామం పెట్టారని తన టీమ్ సభ్యులే అడగడంతో కంగుతున్న లోకేశ్.. ఈ సారి అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి అందిస్తానని నమ్మించారు. జీఓ నంబర్ 3పై అవగాహన లేదని, పరిశీలించి జీఓ రద్దుకు కృషి చేస్తామని మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఇన్‌కమ్ ట్యాక్స్ కడుతున్నవారికీ సంక్షేమ పథకాలు అందిస్తానని సత్తిరాజు అనేవ్యక్తి ప్రశ్నకు లోకేశ్ సమాధానమిచ్చారు. సభకు టీడీపీ మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మొఖం చాటేశారు.

ఎన్నికల భారతం పుస్తకావిష్కరణ


ఎన్నికల భారతం పుస్తకావిష్కరణ చేస్తున్న అభ్యుదయవాది జగన్నాథస్వామి, తదితరులు

విజయనగరం టౌన్: ఓటర్లను చైతన్యవంతం చేసి.. ప్రజాస్వామ్య విలువలు కాపాడాలనే ఉద్దేశంతో ఎన్నికల భారతం అనే కవితా సంకలనాన్ని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రజల ముందుకు తీసుకువచ్చిందని అభ్యుదయవాది జగన్నాథస్వామి అన్నారు. మంగళవారం స్థానిక గురజాడ స్వగృహంలో ఎన్నికల భారతం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంకలనంలో ఎన్నికల భారతంపై నిర్వహించిన కవితల పోటీలలో ఉత్తమమైన 20 కవితలతో పాటు శ్రీశ్రీ, జాషువా, కాళోజీ వంటి పాతతరం కవులతో పాటు ఈనాటి కవులు పాపినేని శివశంకర్, గౌరునాయుడు, స్వామినాయుడు, అనిల్ డానీ వంటి కవుల కవితలు పొందుపరిచినట్లు చెప్పారు.

జగనన్నపై నమ్మకంతో...


టీడీపీ, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు
- టీడీపీ, జనసేనలకు గుడ్‌బై చెప్పిన 200 కుటుంబాలు
- పార్టీలోకి ఆహ్వానించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ఎన్నికల సంగ్రామం దగ్గరపడుతున్న తరుణంలో అధికార వైఎస్సార్‌సీపీలోకి వలసలు మరింత ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16, 46 డివిజన్‌లకు చెందిన 200 మంది పైగా కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీలను వీడి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికీ కోలగట్ల కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులేనని, వారికి ఎళ్లవేలలా తన సహకారం ఉంటుందన్నారు. 16వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జల నారాయణరావు, 46 డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకుడు బొద్దూరు లక్ష్మణరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోలగట్ల మాట్లాడుతూ, తాము చేసిన అభివృద్ధిని చూసి ఆకర్షితులై పార్టీలో చేరడం పార్టీ విజయావకాశానికి శుభసూచికమని తెలిపారు. ఏ సమయంలో ఎటువంటి అవసరం వచ్చినా అండగా నిలబడతానని చెప్పారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గుజ్జల నారాయణరావు, బొద్దూరు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే శంబంగి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పక్కిలో గల ఎమ్మెల్యే స్వగృహం వద్ద తెర్లాం మండలం అరసబలగకు చెందిన 15 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికీ ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, టీడీపీలో చాలా ఇబ్బందులు పడ్డామన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాలు వర్తించాయని తెలిపారు. అందుకే టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు, తెర్లాం వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, మాదాసు శేషగిరి, ఆవాల తిరుపతిరావు, రామారావు, రమణ, సాయి మోహన్, సుందరాడ, కొరటాం, పాములవలస సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఉప సర్పంచ్ వర్గం..

టీడీపీ మోసపూరిత సిద్ధాంతాలు నచ్చక తాము వైఎస్సార్‌సీపీలో చేరినట్టు మండలంలోని శివడవలస గ్రామ ఉపసర్పంచ్ నాగ్గల సంగమ్మ, దిబ్బయ్య, తదితరులు తెలిపారు. మండలంలోని పక్కిలోని ఎమ్మెల్యే స్వగృహంలో వీరందరూ వైఎస్సార్‌సీపీలో చేరారు.

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి...


వైఎస్సార్‌సీపీలో చేరిన ముషిడిపల్లి యువకులతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: మండలంలోని ముషిడిపల్లి గ్రామానికి చెందిన పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే హైమావతి, పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ, పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన స్థానం దక్కుతుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ముషిడిపల్లి గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ చేతిలో కీలుబొమ్మలా ఈసీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, తదితరులు

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: ఎలక్షన్ కమిషన్ టీడీపీ చేతిలో కీలుబొమ్మలా మారిందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎలక్షన్ కమిషన్ తీరు అగమ్యగోచరంగా తయారైందని ఆరోపించారు. తెలంగాణాలో ఎంపీ ఎన్నికలున్నప్పటికీ, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించగా.. మన రాష్ట్రంలో మాత్రం విద్యాకానుక కింద రూ. 610 కోట్లు విడుదల చేయడానికి ఈసీ ఆంక్షలు విధించడం దారుణమన్నారు. అలాగే రైతులకు రూ. 7 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా ఎవ్వరు అడ్డుకుంటున్నారో ప్రజలకు అర్థమైందని చెప్పారు. నేడు ఎన్నికల కమిషన్ ఎవ్వరి చేతుల్లో ఉందో.. ఎవ్వరు చెప్పినట్లు నడుస్తుందో అందరికీ అర్థమైందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి హామీలనే చంద్రబాబునాయుడు కాపీ కొట్టి సూపర్ సిక్స్‌గా ఇప్పుడు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ చేసిన మంచే విజయాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పార్టీ మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, బైరెడ్డి శ్రీనివాసరావు, కర్రి రామునాయుడు, పొట్నూరు సూరినాయుడు, ముచ్చర్ల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అంతులేని విషాదం..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి
- రోడ్డున పడిన కుటుంబాలు


మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు


స్కూటీని ఢీకొట్టి కాలువలోకి దూసుకెళ్లిన కారు


గూడెపువలస కిరణ్ (ఫైల్)


లంక సూరప్పల నాయుడు (ఫైల్)

భోగాపురం/డెంకాడ: వారిద్దిరూ గతంలో వేర్వేరు గ్రామాల్లో వలంటీర్లుగా పనిచేస్తూ వారి కుటుంబాలకు ఆసరాగా ఉండేవారు. అయితే ఈ మధ్యకాలంలో విపక్షాల విష ప్రచారంతో విసుగు చెందిన వీరిద్దరు ఒకేసారి విధులకు రాజీనామా చేశారు. ఎలాగూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని.. తిరిగి చేరుదామని ఆలోచనలో ఉన్నారు. అయితే ఇంతలో జరగరాని ఘోరం జరిగిపోయింది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ ఒకేసారి మరణించడంతో ఆయా కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... డెంకాడ మండలం సింగవరం గ్రామానికి చెందిన కిరణ్ (26).. లంకపేటకు చెందిన లంక సూరప్పలనాయుడు (32) వలంటీర్లుగా పనిచేసి ఇటీవల రాజీనామ చేశారు. వీరిద్దరూ సోమవారం రాత్రి పెట్రోల్ కొట్టించేందుకు స్కూటీపై భోగాపురం వచ్చి తిరుగుముఖం పడుతుండగా.. వెనుకనుంచి వచ్చిన కారు వీరిని ఢీ కొట్టింది. దీంతో సంఘటనా స్థలంలోనే ఇద్దరూ కన్నుమూశారు. కిరణ్‌కు ఏడాది కిందటే వివాహం జరగ్గా, ప్రస్తుతం అతని భార్య శైలజ గర్భవతి. మరో మృతుడు సూరప్పలనాయుడుకు మూడేళ్ల కిందట వివాహం జరగ్గా.. భార్య మాధవి, ఏడాది పాప ఉంది. మృతులిద్దరూ కుటుంబాలకు పెద్దదిక్కు కావడంతో వారి కుటుంబాల్లో చీకటి అలముకుంది. ప్రమదానికి కారణమైన కారు డ్రైవర్ పిట్టా సురేష్ మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. ప్రమాదంలో అతనికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

ఎమ్మెల్యే బడ్డుకొండ పరామర్శ..

భోగాపురం మండలంలోని సుందరపేట ఆస్పత్రిలో ఉన్న గూడెపువలస కిరణ్, లంక సూరప్పలనాయుడు మృతదేహాలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనరసయ్య, ఆయన కుమారుడు ప్రదీప్‌నాయుడు సందర్శించి, నివాళులర్పించారు. మృతుల కుటుంబాలను పరామర్శించి, ఓదార్చారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు


ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎన్నికల అధికారి

విజయనగరం అర్బన్: రానున్న సాధారణ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్న వయోవృద్ధులు, దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద తగిన వసతులు కల్పించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వసతులను వినియోగించుకునే నిమిత్తం ఎన్నికల సంఘం రూపొందించిన సాక్షం యాప్‌లో వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. యాప్‌లో నమోదు చేసుకున్న దివ్యాంగులు, వయోవృద్ధులకు వీల్‌చైర్, పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్లి తిరిగి ఇంటికి తీసుకువచ్చే విధంగా రవాణా సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, షెల్టర్, పార్కింగ్, వలంటరీ సేవలను అందించనున్నట్లు తెలిపారు. సాక్షం యాప్ వినియోగంపై రాష్ట్ర ఎన్నిక సంఘం అదనపు సీఈఓ నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఆయా వర్గాల వారికి కల్పిస్తున్న వసతులపై అవగాహన కల్పించారని దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎ.డి జీవీబీ జగదీష్ మరో ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సీతానగరం: రాష్ట్ర రహదారిపై చిన్నారాయుడుపేట–గుచ్చిమి గ్రామాల మధ్య ఇసుకతో వెళ్తున నాటుబండిని వెనుక నుంచి వస్తున్న లారీ మంగళవారం ఢీ కొనడంతో నాటుబండి తోలుతున్న వ్యక్తి గాయాలపాలయ్యాడు. అప్పయ్యపేట గ్రామానికి చెందిన బాలకృష్ణ నాటు బండితో నర్సిపురం వస్తుండగా.. బొబ్బిలి నుంచి పార్వతీపురం వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన బాలకృష్ణకు పార్వతీపురం ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.


విజయనగరం రూరల్ మండలం ద్వారపూడిలో వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్, వైఎస్సార్ రైతుభరోసా కేంద్రం

మనసు తెలిసిన మారాజు జగన్

గర్భస్థ శిశువు దశ నుంచి వృద్ధాప్య దశ వరకూ ఎవరికేమి కావాలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే తెలుసు... మా మనసు తెలిసిన మారాజు... ఆయన చల్లగా ఉండాల... అని కొందరు, మేము గత ఎన్నికల్లో ఓటేయక పోయినా మాకు మేలు చేశారు, ఇప్పుడు ఆయనకు ఓటేస్తాం అని మరికొందరు తమ మనసులో మాటను కుండబద్దలుకొట్టి చెప్పారు. నాడు–నేడు అనేలా స్కూళ్లు, గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్, రోడ్లు ఇలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత 58 నెలల కాలంలో చేసిన అభివృద్ధి కళ్లముందు కనిపిస్తుందని, వాటి ప్రయోజనమేమిటో అనుభవమైందని కొంతమంది అన్నారు. నవరత్నాల పథకాలతోనే కాదు కరోనా కష్టకాలంలోనూ ఆదుకున్నవారిపై విశ్వాసం ఉంచుకుంటామని మరికొంతమంది చెప్పారు. ఎన్నికల వేళ జనం ఎటువైపు ఉన్నారన్నదే ఎక్కడా సాగుతున్న చర్చ. ఈ సందర్భంగా విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ద్వారపూడి, గుంకలాం, గుంకలాం జగనన్న కాలనీ, గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బోడసింగిపేట, మామిడిబంద కాలనీ, గజపతినగరం, పార్వతీపురం నియోజకవర్గం పరిధిలోని సీతానగరం, వెంకంపేట వరకూ సాగిన 'సాక్షి' రోడ్ షోలో పలువురిని పలకరించాం. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తమకు జరిగిన మేలును ప్రస్తావిస్తూనే కచ్చితంగా మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.

– అల్లు సూరిబాబు, సాక్షి ప్రతినిధి, విజయనగరం

- మాకేమి కావాలో జగన్‌కు మాత్రమే తెలుసు
- ఓటేయకపోయినా మేలు చేశారు... మేలు చేసినందుకు ఓటేస్తాం
- జగన్ చేసిన అభివృద్ధి మనందరి కళ్ల ముందు కనిపిస్తుంది
- కరోనా కష్టకాలంలోనూ అన్నలా ఆదుకున్నారు
- అన్నివిధాలా ఆదుకున్నవారిపై విశ్వాసం ఉంచుకుంటాం
- 'సాక్షి రోడ్‌షో'లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఓటర్ల మనోగతం

విజయనగరం అసెంబ్లీ పరిధి ద్వారపూడిలో...

గత టీడీపీ పాలనలో కేంద్ర మంత్రిగా ఉన్న పూసపాటి అశోక్ గజపతిరాజు దత్తత తీసుకొన్నా అభివృద్ధిలో నాడు అనాథగానే ఉన్న విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ద్వారపూడి తొలుత వెళ్లాం. ఇంజినీరింగ్ కాలేజీలో పని కోసం వెళ్తున్న మహిళలను ఆపి మాట్లాడాం.

రోడ్ షో బృందం: ఏమ్మా... ఈసారి ఎవరికి ఓటేస్తారు?

సాబిబిల్లి సీతమ్మ, లెంక బంగారమ్మ: ఓటు ఎవరికి వేస్తామో బయటకు చెప్పం. నాలుగు మెతుకులు తింటున్నామంటే ఆ విశ్వాసం చూపిస్తాం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు పథకాలన్నీ వస్తున్నాయి. చేయూత డబ్బులు మూడుసార్లు బ్యాంకు ఖాతాలోనే పడ్డాయి. పింఛన్ వలంటీర్లు ఇంటికి తెచ్చిఇచ్చేవారు. పైసా లంచం ఎవ్వరికీ ఇవ్వలేదు. ఎవరి చుట్టూ తిరగలేదు. మాకు ఏ పథకం వస్తుందో వారే తెలుసుకొని వచ్చేలా చేస్తున్నారు. ఇప్పుడు అంతా బాగుంది.



పార్వతీపురం నియోజకవర్గం సీతానగరం...



పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సీతానగరం మండల కేంద్రంలో చిన్న దుకాణం నిర్వహిస్తున్న భాగ్యలక్ష్మిని రోడ్ షో బృందం పలుకరించింది.

రోడ్ షో బృందం: మహిళలకు ఎవరి పాలన బాగుంది?

భాగ్యలక్ష్మి: డ్వాక్రాలో ఉన్నవాళ్లందరి రుణాలు మాఫీ చేస్తామంటే 2014 ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటేశాం. అధికారంలోకి వచ్చాక పసుపు కుంకుమ అని రూ.10 వేలు చేతిలో పెట్టారు. అతన్ని నమ్మినవారంతా బ్యాంకు వాళ్లతో ఇబ్బందులు పడ్డాం. కానీ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తానంటే చేస్తారంతే. ఆసరా, చేయూత, సున్నా వడ్డీ పథకాలన్నీ ఎంతో ఉపయోగపడుతున్నాయి. మేమైతే జగన్‌మోహన్‌రెడ్డికే ఓటేస్తాం.

పార్వతీపురం మండలం వెంకంపేట...



పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామంలో రచ్చబండపై కూర్చున్నవారిని పలుకరించాం. అక్కడున్న రైతులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తి వ్యక్తంచేశారు.

పెదిరెడ్డి సింహాచలనాయుడు, రైతు: గతంలో ఏ సమస్యలతోనైతే రైతులు ఇబ్బందిపడ్డారో జగన్‌మోహన్‌రెడ్డి వాటన్నింటికీ పరిష్కారం చూపించారు. వైఎస్సార్ రైతుభరోసా కేంద్రం మాకు చేయూతగా ఉంది. మా రైతుల గ్రూపుకి యంత్రసాయం కింద ట్రాక్టరు కూడా ఇచ్చారు. విత్తనాల నుంచి పంటల కొనుగోలు చేసేంతవరకు రైతు భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి.

గుంకలాం గ్రామంలో...

గుంకలాం గ్రామస్తులతో మాట్లాడుతుంటే మా బృందాన్ని ఆ గ్రామ సర్పంచ్ కునుకు వెంకటరావు (నాగరాజు) పలుకరించారు. ఇదే సందర్భంగా ఆ గ్రామంలో రాజకీయ పరిస్థితుల గురించి అడిగాం.

రోడ్‌షో బృందం: జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఫలాలు ప్రజలకు చేరుతున్నాయా?



గుంకలాం సర్పంచ్: ఒకప్పుడు గ్రామమంతా ఏకమై టీడీపీకి కంచుకోటగా ఉండేవారు. దశాబ్దాలుగా పచ్చజెండా మోసినా గ్రామంలో అభివృద్ధి గురించి పట్టించుకునేవారు కాదు. విద్య, వైద్యం, ఏ అవసరమైనా సరే విజయనగరమో లేదంటే విశాఖపట్నమో పోవాల్సివచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక నాటి పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. ఏకంగా మినీ కలెక్టరేట్ (గ్రామ సచివాలయం)నే మా ఊరికి తెచ్చారు. ప్రజలకు చెంతనే 540 పైగా సేవలు అందుతున్నాయి. రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ వచ్చాయి. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అద్భుతం. దీర్ఘకాలిక రోగులకు, వృద్ధులకు ఇంటివద్దనే వైద్య సేవలు అందేలా చేశారు. ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో మా గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాం. ఇదంతా చూసిన గ్రామస్తుల ఆలోచన మారింది. జగనన్నకు ఓటేస్తామనే వారి సంఖ్య 2019 కన్నా బాగా పెరిగింది. మళ్లీ ఆయన ప్రభుత్వమే రావాలని బలంగా కోరుకుంటున్నాం.

గుంకలాం హైస్కూల్‌లో...



విజయనగరం రూరల్ మండలంలోని గుంకలాం గ్రామానికి వెళ్లాం. అక్కడ నాడు–నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేసిన హైస్కూల్‌ను పరిశీలించాం. సెలవులు ఇచ్చేశారని విద్యార్థులు అల్లరిచిల్లరగా తిరగకుండా స్థానిక యువత, ఉపాధ్యాయులు చొరవ తీసుకొని ఆ పాఠశాలలోనే కూర్చోబెట్టి వారి విజ్ఞానానికి మెరుగుపెడుతున్నారు. అక్కడున్న ఉపాధ్యాయుడితో మాట్లాడాం. (ఎన్నికల కోడ్ దృష్ట్యా అతని పేరు, ఫొటో ఇవ్వట్లేదు)

రోడ్ షో బృందం: మీ ఊరి హైస్కూల్ వేసవిలోనూ ఉపయోగపడుతున్నట్లుందే?

ఉపాధ్యాయుడు: నేను కూడా గుంకలాం హైస్కూల్‌లోనే చదివాను. గతంలో పాత భవనాలు రెండే ఉండేవి. సౌకర్యాలు అంతంతమాత్రమే. మా తర్వాత కాలంలో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను విజయనగరంలో ప్రైవేట్ స్కూళ్లకు పంపించేవారు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన పనుల్లో నాకు బాగా నచ్చింది విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు. నాడు–నేడు కార్యక్రమంతో మా పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. అదనపు భవనాలు నిర్మించారు. మరుగుదొడ్లు సహా మౌలిక సదుపాయాలన్నీ కల్పించారు. తరగతికి ఒక్కటి చొప్పున ఐఎఫ్‌పీ బోర్డులు వచ్చాయి. టోఫెల్ శిక్షణ, బైజూస్ కంటెంట్... ఇలా ఎక్కడో కార్పొరేట్ స్కూళ్లలో కూడా లేనటువంటి సౌకర్యాలు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాల్లోకి తీసుకురావడం ఓ అద్భుతమే. అవన్నీ కొనసాగించే ప్రభుత్వాన్నే ఎంచుకోవడం ప్రజల బాధ్యత. మా స్కూల్ విద్యార్థుల సంఖ్య 221 నుంచి గత మూడేళ్లలో 375కి పెరిగింది.

బొండపల్లి మండలం బోడసింగిపేట...

గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బొండపల్లి మండలం బోడసింగిపేట గ్రామంలో పలువురితో మాట్లాడాం.

బంకురు సూర్యనారాయణ, చిరు ఉద్యోగి:



బాడంగి మండలం నుంచి ఉపాధి కోసం చానాకాలం క్రితమే బోడసింగిపేట వచ్చేశాం. చిన్న ఉద్యోగం చేసుకుంటూ ఇక్కడే అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. గత టీడీపీ పాలన కాలంలో కరువు వల్ల వ్యవసాయం దెబ్బతింది. రైసుమిల్లులు, కోళ్ల ఫారాలు వంటి అనుబంధ పరిశ్రమలు నష్టపోయాయి. నాలాంటి చిన్న ఉద్యోగులకు ఇబ్బందికర పరిస్థితులొచ్చాయి. పొట్టచేత పట్టుకొని మరెక్కడికైనా వలసపోదామనుకున్న సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చింది. రూ.10 లక్షల విలువైన ఇంటిస్థలాన్ని ఉచితంగా ఇచ్చింది. ఇల్లు కట్టుకున్నాం. నా ఉపాధికి ఢోకా లేదు. జగన్‌మోహన్‌రెడ్డి పార్టీనే గెలిపించుకుంటాం.

బోడసింగి రఘు, మాజీ వలంటీరు:



చంద్రబాబు, పవన్ కల్యాణ్ మా వలంటీర్లను ఎంతగా అవమానించారంటే జిల్లాలో ఉత్తమ వలంటీరుగా పురస్కారం పొందిన నాకే వారిపై అసహ్యం కలిగేది. ప్రజలకు సేవ చేస్తుంటే అంత కసిగా పగబట్టడం అవసరమా? వారి పార్టీలకు బుద్ధిచెప్పడానికే వలంటీరు పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసేశా. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గారి కోసం పనిచేస్తున్నా. వలంటరీ వ్యవస్థను కొనసాగిస్తామన్నా, రూ.10వేలు వేతనం ఇస్తామన్నా చంద్రబాబును మా వలంటీర్లు ఎవ్వరూ నమ్మట్లేదు.

కోసూరు అనసూయ, గృహిణి:



మేము ఎప్పుడూ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటాం. మేము ఉండటానికి ఇల్లు ఇచ్చారు. పైసా లంచం లేకుండా పథకాలు ఇస్తున్నారు. ఒక కుటుంబం ప్రశాంతంగా జీవించడానికి భరోసా కల్పించారు. ఇంతకన్నా ఇంకేమి కావాలి. టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఒక్క పథకం కూడా ఇలాంటివి లేవు. ఒకటీ రెండు ఉన్నా ప్రతి దానికి జన్మభూమి కమిటీ వాళ్లు చెప్పినవారికే వచ్చేవి. ఇప్పుడలా కాదు మా కాలనీలో అందరికీ అర్హతను బట్టి పథకాలు అందుతున్నాయి. ఇలాంటి ప్రభుత్వాన్ని కాదనుకుంటే కష్టాలను కోరితెచ్చుకున్నట్లే.

గజపతినగరం మామిడిబంద కాలనీ...

రోడ్ షో బృందం: చంద్రబాబు మళ్లీ వస్తే ఉచితంగా ఇసుక ఇస్తానంటున్నారు. గతంలో ఆయన పాలనలో ఇసుక ఉచితమేనా?



కర్రి వెంకటరమణ, భవననిర్మాణ కార్మికుడు: చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే. అప్పుడెప్పుడూ ప్రజలకు ఇసుక ఉచితం కాదు. టీడీపీ నాయకుల దగ్గర డబ్బులు పెట్టి కొనుక్కోవాల్సిందే. నాలాంటి భవన నిర్మాణ కార్మికులను ఆదుకున్నది వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులతో మూడేళ్లుగా చేతినిండా పని దొరుకుతోంది. అంతేకాదు నా భార్య శస్త్ర చికిత్సకు వేలాది రూపాయలు ఖర్చు అవుతుందంటే ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేయించారు. మా పిల్లలను ఉన్నత విద్య చదివించుకుంటున్నాం. మద్యం అలవాటు పడినవాళ్లు మాత్రం వాళ్లకు కావాల్సిన బ్రాండ్ దొరకలేదని, రేట్ పెరిగిపోయిందని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు తప్ప సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి కుటుంబం జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉంటుంది.


విజయనగరం శివారులోని గుంకలాం జగనన్న కాలనీ

గుంకలాం జగనన్న కాలనీలో....


గుంకలాం జగనన్న కాలనీలో పనిచేస్తున్న భవననిర్మాణ కార్మికులు


గుంకలాం జగనన్న కాలనీలో మండపాక మహాలక్ష్మి ఇల్లు

పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 397 ఎకరాల విస్తీర్ణంలో 10,360 కుటుంబాలకు సొంతిల్లును సమకూర్చేందుకు నిర్మిస్తున్న జగనన్న కాలనీకి వెళ్లాం.అదొక కాలనీ కాదు ఏకంగా పట్టణమే నిర్మాణమవుతోంది. అక్కడ భవన నిర్మాణ కార్మికులను పలుకరించాం. వారిలో కొంతమంది టీడీపీ అభిమానులు కూడా ఉన్నారు. ఓటు ఎవరికి వేస్తారని అడిగాం. తాము ఓటు ఎవరికి వేసినప్పటికీ గత టీడీపీ పాలనలో కన్నా ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే తమకు అన్ని పథకాలు వస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. తాము ఓటేయనప్పటికీ మేలు చేశారు. మేలు చేశారు కాబట్టి జగనన్నకు ఓటేస్తామని కొంతమంది ఖరాఖండిగా చెప్పారు. జగనన్న కాలనీ వచ్చినప్పటి నుంచి తమకు ప్రతి రోజూ పని దొరుకుతోందని ఆనందం వ్యక్తం చేశారు.

అందమైన ఇల్లు నిర్మించుకున్నాం



'ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇంటిస్థలంతో ఇల్లు కూడా మంజూరు చేశారు. ఇంటిస్థలం రిజిస్ట్రేషన్ కూడా ఉచితమే. అదెంత స్థలం బాత్‌రూమ్‌కు కూడా సరిపోదని, సమాధికే సరిపోతుందని మాట్లాడిన టీడీపీ నాయకులు ఇక్కడికొస్తే ఆ కొద్దిస్థలంలోనే అందంగా మేము నిర్మించుకున్న ఇల్లు చూపిస్తాం. లక్షల రూపాయలు విలువైన ఆస్తిని బహుమతిగా ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరచిపోలేం.

– మండపాక మహాలక్ష్మి, జగనన్న కాలనీ, గుంకలాం, విజయనగరం మండలం

పోలింగ్ బూత్‌లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

- మాక్ పోలింగ్ ఉదయం 5.30కే ప్రారంభించాలి
- సూక్ష్మ పరిశీలకులు పోలింగ్ బూత్‌ల వద్ద కనీస సౌకర్యాలను తనిఖీ చేయాలి
- సూక్ష్మ పరిశీలకుల శిక్షణలో జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్:

పోలింగ్ బూత్‌లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఫారం–28లో రిపోర్ట్‌ను సాధారణ పరిశీలకులకు పంపించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సూక్ష్మ పరిశీలకులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు తలేత్ పర్వేజ్ ఇక్బాల్, హనీష్ చాబ్రలతో కలిసి సూక్ష్మ పరిశీలకుల విధులను, బాధ్యతలను కలెక్టర్ వివరించారు. సూక్ష్మ పరిశీలకలంతా 12వ తేదీన ఉదయం నియోజకవర్గం స్థాయిలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో రిపోర్ట్ చేయాలని, ముందుగా పోలింగ్ స్టేషన్ పరిధిలో కనీస సౌకర్యాలను తనిఖీ చేసి సాధారణ పరిశీలకులకు నివేదిక ఇవ్వాలని తెలిపారు. పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటకే పోల్ ప్రారంభించాలని తెలిపారు. నిబంధనల మేరకు ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లో ఎన్నికల సిబ్బంది, పోలింగ్ ఏజెంట్‌లు ఎవరికి కేటాయించిన సీట్లలో వారు కూర్చోవాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పార్టీ గుర్తులు, రంగులు, కండువాలు, జండాలు వంటివి ఉండకూడదని స్పష్టం చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఆర్ఓ ఈవీఎం క్లోజ్ బటన్ తప్పని సరిగా ప్రెస్ చేయాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్‌లు అభ్యర్థికి ఒక్కరు మాత్రమే బూత్‌లో ఉండాలని, మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఏజెంట్ రిలీవర్ ఉండకూడదని స్పష్టం చేశారు. మీడియా వారికి ఎన్నికల కమిషన్ జారీచేసిన అథారిటీ లెటర్ ఉంటేనే అనుమతించాలని, మిగిలిన వారిని అనుమతించ కూడదని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ సుధాకర్‌రావు ఓటింగ్ విధానం, చాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, బ్లైండ్ ఓటు, బీలో ఏజ్, రిజెక్టెడ్ ఓటు తదితర ఓట్లను ఎలా వేయాలనే అంశాలను పీపీటీ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ అనిత, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సాధారణ పరిశీలకులు తలేత్ పర్వేజ్ ఇక్బాల్, హనీష్ చాబ్ర


హాజరయిన ఎన్నిక నిర్వహణ సిబ్బంది, అధికారులు